"ఇష్టపడిన అమ్మాయి మనసును గెలుచుకోగలిగాను కదా? నా దృష్టిలో, జీవితంలో అదే గొప్ప విజయం ! కాదంటారా?"

అవని చిరునవ్వుతో చూసి కొంచెంగా తల వాల్చింది. నునుసిగ్గులాంటి భావంతో.

" ఏమిటో...ఈ రోజు నా అదృష్టం ఇలావుంది ! ఒకటీ రెండూ కాదు, ఇష్టమైన అమ్మాయి ఇంపైన భంగిమలెన్నో కంటి కెమేరాకి చిక్కాయి! ఇంటికి వెళ్ళి మనసులో నుండి ఆ ప్రింట్లన్నీ తీసుకుని తరిచి తరిచి తనివితీరా చూసుకోవాలి!"

" అన్ని ఫోజులు...ఏం వున్నాయి?" కొంచెం చిరుకోపాన్ని నటిస్తూ అడిగింది.

" ఎందుకు లేవూ ? ప్రేమ గురించి ప్రేమగా చూస్తూ ప్రేమగా చెప్పేటప్పుడూ, హాయిగా నవ్వుతూ చూసే తీరులోనూ, చిరుకోపాన్ని అభినయించేటప్పుడు, వాలు చూపుతో చిరునవ్వులను రువ్వుతూనూ..."

మధ్యలో అడ్డం వచ్చి " ఇక చాల్లెండి. ఆలస్యమెందుకూ, ఇంటికి బయలుదేరి వెళ్ళండి. ప్రింట్స్ తీసుకునే పనిలో పడుదురుగానీ.." వ్యంగ్యంగా అంది.

ఇద్దరూ చిరునవ్వులతో వీడ్కోలు చెప్పుకుని చెరో దారినా వెళ్ళిపోయారు.

*****

ఆ రాత్రి..పక్క మీద విశ్రాంతిగా పడుకున్న అవని, సుభాష్ తో జరిగిన సంభాషణని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుంది.

ఇంటికి వెళ్ళి కంటి కెమెరాతో తీసిన ఫొటోలు చూసుకోండని అతనితో వేళాకోళంగా అన్నదిగానీ....ఇప్పుడు తను చేస్తున్నదీ అదేగా అనుకుని మనస్సులోనే నవ్వుకుంది. ఆ తర్వాత...సుభాష్ ని కలిసిన మొదటి రోజు కళ్ళముందుకు వచ్చింది.

క్యాంపు నుండి బస్సులో వచ్చిన తను ఇంటికి బయలుదేరబోటోంటే..." అవని మేడం ఇల్లు బస్ స్టాండ్ కి కొంచెం దగ్గర్లోనే వుంటుందని అన్నారు. ఎటు వెళ్ళాలో చెబుతారా ? " అంటూ ఎవరో ఇంకొకర్ని అడగటం వినిపించింది.

అటు తిరిగి అతనితో " నేను అటే వెళుతున్నాను...రండి, చూపిస్తాను " అంది.

సరేనంటూ తనతో పాటుగా వచ్చినతనికి, ఆ వీధిలోకి రాగానే రెండో ఇల్లును చూపిస్తూ, ' ఇదే' అని చెప్పింది. అతను ' థేంక్స్ చెప్పి ముందుకు వెళ్తోంటే, ఆశ్చర్యంగా 'హలో' అంటూ పిలిచి ' అదేమిటీ...ఈ ఇల్లేనని చెప్పాగా, మరి ముందుకు వెళ్తున్నారేం?" అనడిగింది.

అతను చిరునవ్వుతో చూసి " నాకు ఆమెతో పనేంలేదండీ. నాకు కావాల్సిన అడ్రసు చెప్పినవాళ్ళు అవనిగారుంటున్న వీధిలో చివరి ఇల్లు అని చెప్పారు...అందుకే.." అంటూ ముందుకు వెళ్ళిపోయాడు.

తను తెల్లమొహం వేసి రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయింది ! అసలు ఎవరతను ? ఊరికి కొత్తవాడే...చివరి ఇల్లు భీమన్నది. అంటే...ఇతనికి భీమన్నతో ఏం పని వుందో..!

కుతూహలంతో కొంచెం నెమ్మదిగానే అడుగులు వేస్తూ వెనకే వెళ్ళింది.

భీమన్నది పేరుకు ఇల్లే గానీ...పడిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక గదీ, చిన్న వసారా..అంతే ! పెంకులు చాలా చోట్ల ఊడిపోయాయి. పైకప్పునిండా కన్నాలే ఎక్కువ.

బార్లా తెరిచి వున్న తలుపు దగ్గర తను నిలబడింది.

" మీ గురించి...పేపరులో వచ్చిన వార్త చదివి, కలుసుకోవాలని వచ్చాను. మీరు పేరుకు తగ్గట్లు దేహ దారుఢ్యంతో వుంటారని అనుకున్నాను. కానీ...ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే.....పూర్తిగా వ్యతిరేకంగా వున్నారు. అయితే మీ సంకల్పబలం మాత్రం చాలా గొప్పదని అర్థం అయింది ! "

" అయ్యా...మీరెవరో నాకు తెలవదు. మీరు ఎవరికోసం వచ్చారో...ఏం అంటున్నారో అదీ తెలవటం లేదు..." అయోమయంగా చూస్తూ భీమన్న అన్నాడు.

" మీ కోసమే వచ్చాను. పేపరులో మీ ఫోటో కూడా వచ్చిందిగా. మీరు తలపెట్టిన జలయజ్ఞం గురించి రాసారు. చనిపోయిన మీ భార్య జ్ఞాపకార్థం, మీ పొలంలో మీరొక్కరే మూడేళ్ళుగా చెరువు తవ్వుతున్నారా....అది తెలిసి నేను ఆశ్చర్యంతో తలమునకలయ్యాను ! అవును ! గొప్ప వాళ్ళు తమ కిష్టమైన వాళ్ళు చనిపోతే, డబ్బు ఖర్చు పెట్టి అట్టహాసంగా స్మృతి మందిరాలు కట్టించవచ్చునుగానీ....ఇలా మీరు ఒక్కరూ ఊరివాళ్ళందరికీ ప్రయోజనకరంగా ఉండేట్లుగా ఓ చెరువును తవ్వాలనుకోవటం...ఎంత గొప్ప విషయమో! "

భీమన్న కొంచెం సిగ్గుపడుతూ నవ్వు మొహంతో అతని వేపు చూశాడు.

" అదీ...ఆ రోజు...ఎవరో కొత్తాయనేలెండి..నన్ను చూసి ఏదో అడిగితే...ఏదో చెప్పా. పేపరులో ఆ మాట రాస్తానని అన్నాడుగానీ నిజమనుకోలే ! అయినా ఇందులో గొప్పతనం ఏముందండీ....ఏం చేసినా మా ఊరివాళ్ళకోసమేగా, అంతా ఒక ఊరి వాళ్ళం...ఒకటే కదండీ ! "

అతను మాటరానివాడిలా భీమన్నవేపే చూస్తూ నిలబడిపోయాడు. ఒక క్షణం తర్వాత " ఒక్కరే...ఈ పని పూర్తి చెయ్యగలననే ధైర్యం ఉందా?" అనడిగాడు.

" అదేమో తెల్వదుగానీ...చేయాలనిపించి చేస్తున్నానంతే. ఒంటరిగా వదిలేసి ఇంటావిడ ఎల్లిపోయింది....కొడుకేమో ఆడి బతుకాడు బతుకుతున్నాడు. ఒకోసారి ' నీకిదేంపనిరా అయ్యా' అని కళ్ళనీళ్ళెట్టుకుంటాడు. అప్పుడప్పుడూ ' చెబితే వినవు కదా' అంటూ కసురుతాడు. అంతే తప్ప జబర్దస్తుగా నా చేతిలో పలుగూ పారా లాక్కోలేదు. అందువల్లే నా పని చేసుకుపోతన్నానండి. ఆడు మంచోడుకాబట్టే నాకూ ఓ ముద్దపెడతన్నాడు...నేను పని చేయగలుగుతున్నానండీ " అన్నాడు గొప్పతనం ఏదైనా ఉంటే, అది తన కొడుకుదేనన్నట్లుగా.

భీమన్న ఒక్కడే తన సొంత భూమిలో చెరువు తవ్వుతున్నాడని తనూ వింది. కొద్దిమంది మంచి మనసంటూ మెచ్చుకుంటే, ఎక్కువమంది మాత్రం ఎగతాళి చేసినవాళ్ళే ! నాన్న ఓసారి భీమన్న గురించి అన్నారు.

" అందరూ నీ ఒక్కడివల్లా ఏమవుతుందిరా " అని నవ్వుతూంటే, వాడికి పంతం, పట్టుదల ఇంకా పెరుగుతున్నాయేమొ. మరికొంచెంసేపు ఎక్కువగా ఆ పనిలోనే ఉంటున్నాడూ " అని !

తమ ఊరివాళ్ళెవరూ భీమన్న పనిలోని గొప్పతనాన్ని గుర్తించలేదు. కానీ....ఇతను ఎక్కడివాడో తెలియదు. పేపరులో ఒక మూల చిన్నవార్తగా వచ్చినదానిని చదివి, భీమన్నను అభినందించటానికే వచ్చాడా?! తను ఆశ్చర్యపోతూ ఆ మాటే అడిగింది. " మీరు....మా భీమన్నని అభినందించటానికే ఈ ఊరు

వచ్చారా ? "

అప్పుడు ఇద్దరూ వెనుదిరిగి గుమ్మందగ్గర నిలబడ్డ తనని చూశారు. భీమన్న వెంటనే " అమ్మా...మీరు ఎందుకు వచ్చారూ ? " అని అడిగాడు.

" నీ గురించి..నన్నే అడిగితే, చెప్పాను. ఎందుకు, ఏమిటి అనిపించి తెలుసుకుందామనీ " అతని వేపు చూసి- " ఇప్పుడైనా చెబుతారా...మీరు ఎవరు...ఈ ఊరు ఎందుకు వచ్చారూ ? " అనడగింది.

అతను భుజాలెగరవేసి " ఎందుకూ అంటే...భీమన్నని కలవటంతో పాటూ ఇంకో పని కూడా పెట్టుకున్నాననుకోండి. నేను ఎవరంటే ఏం చెప్పాలో సరిగ్గా తెలియటంలేదు. జర్నలిస్ట్ అని చెప్పుకోవచ్చనుకుంటా ! కొన్ని విషయాలమీద పరిశోధన జరిపి వ్యాసాలూ అవీ రాసి పత్రికల వాళ్ళకిచ్చి ప్రతిఫలంగా పదోపరకో పుచ్చుకుంటాను ! " అంటూ నవ్వి మళ్ళీ అన్నాడు.

" నేనీ ఊరికి కొత్త కాబట్టి మీకు నా మీద సందేహమేదో వచ్చిందేమో! నా వల్ల ఇక్కడివాళ్ళకు ఏ విధమైన ఇబ్బందీ, హానీ కలగవని  మీరు నమ్మొచ్చు ! తేడా ఏదైనా కనిపిస్తే నిలదీయండి! ఇంకో మాట! భీమన్న చేస్తున్న పనిలోని

గొప్పతనాన్ని గుర్తించి వచ్చానన్న మాటలో అసత్యం ఏమీ లేదు! ఇది ఖచ్చితమే! నేను ఇప్పుడు రాయాలనుకుంటున్న విషయానికి ఇక్కడ కొన్నాళ్ళు ఉండాల్సిరావచ్చు. ఎన్నాళ్ళో ఇప్పుడు నాకూ తెలియదు.

భీమన్న తను చేస్తున్న పని తన వాళ్ళకోసమేగా అన్నాడు. అతను ఈ ఊరివాళ్ళందర్నీ తనవాళ్ళు అనుకుంటున్నాడుగానీ ఊరివాళ్ళు ఎవరూ భీమన్నని తమవాడేనని అనుకోవటంలేదేమోనని నాకు సందేహం వచ్చింది. ఎందుకంటే....అతను చేస్తున్న పనిలో ఏ ఒక్కరూ చేయి కలపటం లేదు కదాని ! ఇప్పుడు మీరు మా భీమన్న అన్నారు..అందుకు నాకు కొంచెం సంతోషమే కలిగింది! "

తను అతనివేపు కొంచెం నిష్టూరంగా చూసింది. అతని మాటలు కొంచెం వ్యంగ్యంగా వున్నాయనిపించింది." ఎక్కడినుండో అభినందించటానికి వచ్చానని చెప్పుకుంటున్నారుగా, కేవలం మెచ్చుకోవటం మాత్రమే ఎందుకూ...నచ్చిన ఆ పనిలో మీరూ చేయి కలపొచ్చుగా.." అని మనసులోనే అనుకుని ఏం మాట్లాడకుండా వెనుదిరిగి వచ్చేసింది.

అయితే ఆశ్చర్యంగా తన మనస్సులోనే అనుకున్న మాట తెలిసినట్లుగా మరునాడు..భీమన్నతో పాటూ అతనూ గునపం పుచ్చుకుని తవ్వుతూండడం చూసింది. నివ్వెరపాటుతో ఒక క్షణం అలాగే నిలబడిపోయింది ! తర్వాత అతనినే " మీరూ...ఎందుకూ...ఇలా... ? " అనడిగింది. చూపులకు శరీరకష్టం అలవాటు లేనివాడిలా కనిపిస్తున్నాడు మరి !

చిరునవ్వుతో చూసి " నిజమైన అభినందన అంటే...అనుకరించటం కూ డా అని నా ఉద్దేశ్యం. అతని శ్రమను నేనూ గుర్తించి గౌరవించినట్లుగా తోడు నిలవాలనిపించింది ! రోజంతా చేయలేను...వీలు దొరికినప్పుడు...అప్పుడప్పుడూ..అంతే !" అన్నాడు.

" ఏమిటో..." అనుకుంటూ తన పనిమీద తను వెళ్ళిపోయింది.

తరువాత వారం రోజులకు కాబోలు, దారిలో కనిపించి " థేంక్స్" చెప్పాడు.

ఎందుకంటూ తను ఆశ్చర్యంగా చూసేసరికి వివరణ ఇచ్చాడు.

" నా పని తగ్గించటనికి సహాయంగా చాలామందిని పంపించారుగా, అందుకు ! ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా మేలు చేశారు! ఎక్కడినుండో వచ్చిన అతను...మన భీమన్న పనిలో సాయపడుతూంటే....మన ఊరివాళ్ళం మాత్రం ఏమీ చేయలేకపోతున్నాం....." అని మీరు కొంతమంది రైతులతో అన్నారట కదా.

ఆ మాట అలా అలా అందరిలోకి వెళ్ళి, ఈ ఊరి కుర్రాళ్ళు వాళ్ళ ఖాళీ సమయంలో వంతులవారీగా వచ్చి, భీమన్న పనిలో పాలు పంచుకుంటున్నారు ! ఒక్కరు చేసే పనికి పదిమంది చేయి కలిపితే, ఎంత తొందరగా పూర్తయిపోతుంది ! ఇది చాలా మంచి విషయం కదూ ? "

అవునన్నట్లుగా తల వూపింది.

అతనిపట్ల గౌరభావం ఏర్పడింది. ఏదైనా చెప్పటం వరకే కాదు, చేతలలోనూ ముందుంటాడని అర్థమైంది.

ఆ తరువాత నాలుగు రోజులకే కాబోలు భీమన్న కొడుకుతోపాటుగా అతని ఇల్లంతా విప్పదీయటం చూసి అదేమిటని అడిగింది.

" ఈ ఊళ్ళో నేను కొన్నాళ్ళుండాలనుకుంటున్నానని చెప్పాగా, ఎక్కడో ఎందుకు భీమన్న ఇంటిలోనే ఉందామని ఆలోచన వచ్చింది. ఆ గదిలో సర్దుకుని ఉంటూ వాళ్ళిద్దరికీ ఇబ్బందిగా మారటం కంటే సౌకర్యవంతంగా ఆ ఇంటిని మార్చాలనుకున్నాను. నా చేత ఖర్చు పెట్టించటం ఎందుకని అనుకున్నాడేమో ముందు భీమన్న ఇష్టపడలేదు. అద్దెలాంటిదేమీ కేకుండా నేనూ కొన్నాళ్ళు వుంటాను కాబట్టి ఇంటికి ఖర్చు పెడుతున్నానంతేనని నచ్చచెప్పటంతో ఒప్పుకున్నాడు. ముందు వసారాతో మూడు గదులుగా ఏర్పాటు చేస్తున్నాం. భీమన్న కొడుకు సాయంతో పాటు ఇంకో ముగ్గురు కూలీలనూ పెట్టాం " అని జవాబు చెప్పాడు.

ఆ పక్కనే గుడారంలాంటిది కనిపించింది. ఇంటి పని పూర్తయ్యేవరకూ తాత్కాలిక నివాసంగా ఏర్పాటుచేసుకున్నారని అర్థమైంది.

" అద్దెకు బదులుగా మీరు ఇంటిమీద పెడుతున్నది చాలా ఎక్కువ అవుతుంది కదా ?" తన సందేహాన్ని బయటపెట్టింది.

తనవేపు కొంచెం ఆశ్చర్యంగా చూసి " అయితేనేం...? ఈ ఊరివాళ్ళకోసం తన సొంత భూమిలోనే చెరువు తవ్వుతూ కష్టపడుతున్న అతనికోసం...కొంచెం సౌకర్యవంతమైన ఇంటిని ఏర్పరచటం కనీస బాధ్యతగా అనిపించింది ! అవును కదూ ?" అన్నాడు.

ఈ ఊరివాళ్ళెవరికీ రాని ఆలోచన అతనికి వచ్చింది! అతనిపట్ల గౌరవం మరింత పెరిగింది.

మళ్ళీ అన్నాడు. " పెంకుల పై కప్పు అంతా కన్నాలే ! భీమన్న సరిగా గమనించుకోలేదుగానీ కూలిపోవటానికి సిద్ధంగా వుంది. అలా జరగకుండా ముందుగా తీసెయ్యటమే మంచిదనిపించింది. నేనే పని చేసినా ఉచితంగా చేయననే మాటా నిజమే...అనుకోండి ! భీమన్నతో కలిసివుండటంవల్ల నాకూ లాభముంది. మీకు చెప్పానో, లేదో గానీ, నేనీ ఊళ్ళో ఉండి పరిశోధించే అంశం...'పల్లెవాసుల జీవనవిధానాన్ని మెరుగుపరిచే విషయాలు !' అన్నాలు తినేటప్పుడో, రాత్రి పూట నిద్రపోయేముందో, కబుర్లుంటాయిగా...అప్పుడు భీమన్న అనుభవాలు, ఆలోచనలు తెలుసుకోవటం నాకుపకరిస్తాయి ! అందుకే..." మధ్యలో ఆపేసి చిన్నగా నవ్వాడు.

" మీరూ అగ్రికల్చర్ కదా...మీకూ రైతుల సమస్యలు, వ్యవసాయం గురించీ బాగా తెలిసివుంటుంది, ఆ విధంగా నా రీసెర్చ్ కి ఉపయోగపడతారని...మీతో పరిచయం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నా..." అంటూ సరదాగా మళ్ళీ నవ్వాడు.

కళ్ళు పెద్దవి చేసి అతనివేపు ఆశ్చర్యంగా చూస్తూ - " ఒక విషయం మీద పరిశోధించి రాయటానికి ఇంత శ్రమ పడుతున్నారా ? " అంది.

" ఎందుకంత ఆశ్చర్యం ? ఇది నాకూ ఉద్యోగంలాంటిదే కదండీ ! మీరు మీ డ్యూటీ ప్రకారం ఊళ్ళు తిరుగుతూ, రైతుల పొలాలని చూసి సలహాలిస్తూ కష్టపడుతున్నారుగా?"

" అది నా ఉద్యోగధర్మం ! మన డ్యూటీని సక్రమంగా చేయటంలో సంతృప్తేగానీ, కష్టం ఉండదు ! మీరు మాత్రం...మీ రీసెర్చ్ కి సంబంధించేకాకుండా ఇంకా ఏదో ప్రత్యేకంగా చేస్తున్నట్టుగా ఉంది ! మీరు...ఈ ఊళ్ళో కొన్నాళ్ళు ఉంటే....తప్పకుండా ఊరికి, జనాలకి మేలు జరుగుతుంది! "

" నా వల్ల కొంతైనా ఈ ఊరుకి మంచి జరుగుతుందనుకుంటే...సంతోషమే ! ఇక్కడకు ఏదో స్వార్థం కోసం వచ్చాననుకోకపోతే...అది చాలు ! ఏ ఊరయినా బాగుపడాలంటే...తప్పనిసరిగా నాలుగు ఆలయాలుండాలని నా అభిప్రాయం ! అమ్మవారి ఆలయం ఉండనే ఉంది. ఇక మిగతా మూడు స్థాపించగలిగితే...నేననుకున్నది సాధించినట్లే ! "

" ఇంకా మూడు గుళ్ళు ఉండాలా ?" ఆశ్చర్యంగా అంది.

" అవును. నా ఉద్దేశ్యం...దేవాలయం ఉండనే ఉంది, మిగతా మూడూ అంటే...వైద్యాలయం, విద్యాలయం, గ్రంథాలయం ! ఈ విషయంలో మీ సహకారం అవసరం ! అందుకే.."

" నేను...నేనేం..చేయగలనూ ?"

" మీరు మీ విధిని...అదే డ్యూటీని నిజాయితీగా చేస్తారనే పేరు ఉంది. ప్రతిఫలంగా ఏమీ ఆశించరని విన్నాను ! అభివృద్ధి సాధించాలంటే...నిజాయితీ అనేది దివ్యమంత్రంగా పనిచేస్తుంది ! అందరూ నిజాయితీగా పనిచేస్తే సాధించలేనిదంటూ ఏమీ ఉండదు ! అయితే దురదృష్టం కొద్దీ ఈ రోజుల్లో...మనకేమిటీ వ్యక్తిగతంగా లాభం అని ఆలోచించేవాళ్ళే ఎక్కువగా ఉంటున్నారు. అందరికోసం చేసే పనిలో మనమూ లాభం పొందుతామనే ఆలోచన అర్థం చేసుకోవటం లేదు ! " అంటూ నిట్టూర్చాడు.

తను అతనివేపు ముగ్ధురాలైనట్లుగా చూసింది.

అతను చిరునవ్వుతో " ఏమిటండీ..అలా చూస్తున్నారూ ? " అనడిగాడు.

తెప్పరిల్లిన తను " చూడాలనిపించినప్పుడు...చూడటమేగా చేయాల్సింది! " అంటూ చిన్నగా నవ్వింది !

అతనూ కొంచెం సిగ్గుపడుతున్నట్లుగా అభినయించి " నేను...అందంగా చూడాలనిపించేలా వుంటానంటారా ?" అని అడిగాడు.

అతనివేపు కొంచెం చురుగ్గా చూసి " అందచందాల ప్రసక్తి దేనికీ ? నేను ఆ మాట అనలేదుగా ? " అంది.

" మరి..? మీ మాటలకు అర్థం ఏమిటో ?"

" నా ఉద్దేశ్యం...రూపురేఖల అందం గురించి కాదని !పదిమందికీ మేలు చేసే విషయాలపట్ల చూశానన్న మాట ! " అంటూ నవ్వేసింది.

అతనూ నవ్వుతూ " చాలా క్లిష్టమైన పదాలతో మెచ్చుకున్నందుకు నా ధన్యవాదాల్ని తెలియజేసుకుంటున్నాను ! " అన్నాడు తమాషాగా కొద్దిగా తలవొంచి.

" సరేగానీ...మీరు తలపెట్టిన యజ్ఞం లాంటి పనిలో..నాకు కేటాయించిందేమిటో చెప్పండి "

" ప్రస్తుతానికి...మిమ్మల్ని కలిసే ఈ ఊరి పెద్దల ద్వారా నాకు సహకరించమనే ప్రచారం సరిపోతుంది ! నా దగ్గర కొన్ని ప్రణాళికలు...అంటే కొందరు తమ ఊరిని ఎలా అభివృద్ధి బాట పట్టించారో పేపరులో వచ్చిన కథనాల్ని చదివి, నేను తయారుచేసిన ఆలోచనలు ఉన్నాయి ! ఈ ఊళ్ళోని ఉత్సాహవంతులైన కొందరు యువకులతో ఒక టీం ఏర్పాటు చేసి...వాళ్ళతో నా ఆలోచనల గురించి చర్చించే సమయాలలో మీరూ పాల్గొంటే బావుంటుందని నా ఆలోచన ! ఏ విషయం గురించి అయినా నలుగురి మధ్య చర్చ జరిగితే ' ఏది సాధ్యం, ఏది అసాధ్యం ' అనేది అర్థం అవుతుంది. మీ వీలును బట్టి, ఖాళీ ఉన్న సమయంలో మీరూ ఆ సమావేశానికి వస్తే, మీ అభిప్రాయాలు తెలియజేయటం బాగుంటుందని....నాకనిపిస్తోంది "

" తప్పకుండా వస్తూంటాను. మీరన్నట్లుగా నా ఖాళీ సమయాలలో అయితేనే..." అని అతనికి మాట ఇచ్చింది.

****

ఆ రోజు తనకి చెప్పిన ఆలోచనల్ని ఆచరణలో పెట్టడం మొదలు పెట్టాడు. ఏదైనా అనుకున్నది సాధించే రకమేనని తనకి గురి కుదిరింది ! అందుకే....అతని ఆలోచనల ఆచరణకు ఊతంగా నిలవాలని నిర్ణయించుకుంది.

అమ్మకు అక్క వరసయ్యే ప్రభావతి పెద్దమ్మ గురించి అతనికి చెప్పింది. పెదనాన్న చనిపోయాడు. వాళ్ళకి పిల్లలు లేరు.

ఒకసారి అమ్మతో తనకున్న రెండెకరాల పొలాన్నీ, ఇంటిని తన తదనంతరం ఎవరో బంధువులు స్వాధీనం చేసుకునేబదులు, తను బ్రతికి ఉండగానే ఊరివాళ్ళకోసం ఏదైనా ఉపయోగకరంగా వినియోగించగలిగితే బావుండుననే ఆలోచన ఉన్నట్లుగా చెప్పటం వింది.

ఏదో సందర్భంలో అది గుర్తుకువచ్చి అతనికి చెప్పగానే, కొంతమందితో కలిసి పెద్దమ్మకు ఏం చెప్పి ఒప్పించాడోగానీ, పెద్దమ్మ ఇంటిలోనే గ్రంధాలయం వెలిసింది. వెనుక ఒక చిన్న గదీ, వంటగదీ తనకు సరిపోతాయనీ, ముందు వుండే మూడు పెద్ద గదులూ గ్రంధాలయం పెట్టుకోవటనికి ఆనందంగా అంగీకరించింది !

తన పోషణకి ఒక ఎకరం మీద వచ్చే ఆదాయం సరిపోతుంది కాబట్టి, ఒక ఎకరం అమ్మేసి ఆ డబ్బునూ గ్రంధాలయానికి ఉపయోగించుకోమనీ పెద్దమ్మ చెప్పిందట.

అది తెలిసి పెద్దమ్మనే అడిగింది - " ఎందుకు పెద్దమ్మా, ఇప్పుడే నీ పొలాన్ని కూడా ఇవ్వటం ? ఇల్లు వరకూ ఇవ్వటం బాగానే వుందిగానీ...అంత ఆస్తీ అతని చేతుల్లో పెట్టటం గురించి బాగా ఆలోచించావా ? " అని.

" నేను బాగానే ఆలోచించాను. అతను....పేరు ఏదో చెప్పాడే...సుబ్బు...కాదు..కాదు...సుభాష్ గురించి ఏం సందేహం అక్కరలేదనిపించింది. శభాషైన కుర్రాడు ! ఆ ఎకరం పొలం అమ్మి పుస్తకాలు అవీ కొనటానికి ఉపయోగించండన్నా....దానికి అతనేం చెప్పాడో తెలుసా ? పుస్తకాలన్నీ, తనకు తెలిసినవాళ్ళదగ్గర్నుండీ, షాపులనుండీ సేకరించి తెస్తాడట !

ఆ ఎకరం అమ్మకుండా, మనవూళ్ళో హాస్పిటల్ కడదామంటున్నాడు ! ఏమిటో అతని ధైర్యం ! మంచి పని తలపెడితే, అదే సమకూరుతుందంటున్నాడు ! ఎలాగో ఏమిటో...ఆ వివరాలు నేను అడగటం బావుండదని ఊరుకున్నా ! "

పెద్దమ్మ మాటలకు ఆలోచనలోపడి " ఎక్కడనుండయినా ఫండ్స్ వచ్చే ఏర్పాటు ఉందేమో " అంది.

" అలాంటిదేదో ఉండే వుంటుందని నాకూ అనిపించింది. అతనితో పాటే తిరుగుతూంటాడుగా మన భగవాన్లు...వాడన్నాడూ....ఫలానా పని కోసమని మన దగ్గర చందాలు వసూలు చేస్తుంటే, లెక్కాడొక్కా అడగాలిగానీ, ఏదో ఖర్చు పెడుతుంటే, మనకెందుకూ ఆ వివరాలవీ అని !

నాకూ ఆ మాటా నిజమే కదా అనిపించింది! ఏమైతేనేం..నా కోరిక మాత్రం ఇలా తీరటం చాలా ఆనందంగా ఉంది ! సరస్వతీ దేవి నా ఇంట్లో కొలువైంది ! కళ్ళారా చూసుకోగలిగాను ! వద్దన్నా ఆ గ్రంధాలయానికి నా పేరు పెట్టాడా, అన్నీ సమకూరి హాస్పిటల్ కూడా కట్టించగలిగితే, దానికి పెదనాన్న పేరు పెడదామని అంటున్నాడు. నిజంగా హాస్పిటల్ పెట్టగలిగితే, నా తదనంతరం మిగిలిన ఆ ఎకరాన్నీ హాస్పిటల్ పెద్దది చేయటానికి ఉపయోగించుకోమనీ చెప్పాను. అలా రాసిచ్చేస్తాను. అతనిమీద నాకంత నమ్మకం ఉంది ! "

పెద్దమ్మ వేపు ఆశ్చర్యంగా చూస్తూండిపోయాను.

ఒక క్షణం తర్వాత మళ్ళీ చెప్పటం మొదలుపెట్టింది.

" నేను ఇలా చేశానని మన బంధువుల్లో చాలామందికి కోపం వచ్చింది. అయినవాళ్ళకి ఆకుల్లోనూ, కానివాళ్ళకి కంచాల్లోనూ వడ్డించినట్లుగా నా పద్ధతి వుందని ఎన్ని నిష్టూరాలో ! పైగా మంచాన పడితే చూసేవాళ్ళు ఉండొద్దూ అంటూ దెప్పిపొడుస్తున్నారు. ఆస్తి కోసం  కాచుక్కూర్చున్న వాళ్ళు సమయం వచ్చినప్పుడు సేవలు చేస్తారన్న నమ్మకం నాకు లేదు !

నిజంగా మంచాన పడితే, గొంతులో గుక్కెడు నీళ్ళు పోసే మంచి మనసున్నవాళ్ళు కరువవుతారా ? ఏమో...ఏదెలా జరిగినా ఫర్వాలేదు ! సుభాష్ కట్టిస్తామంటున్న హాస్పిటల్ లోనే ఓ మూల పడివుంటా..అలాంటి పరిస్థితే వస్తే ! అవునే ! దిక్కూ మొక్కూ లేని పెద్దవాళ్ళని కనిపెట్టుకుని ఉండే ఏర్పాటు కూడా ఆ ఆసుపత్రిలో ఉంటుందని సుభాష్ చెప్పాడు " అంటూ నవ్వింది .

" అయినా ఆ మాటలన్నీ ఇప్పుడెందుకుగానీ...నా ఇల్లు గ్రంధాలయంగా మారటం, పిల్లలూ, పెద్దలూ వచ్చి కూర్చుని చదువుకోవటం, కావాల్సిన పుస్తకాలు ఇంటికి పట్టుకెళ్ళటం...చూస్తుంటే, నాకు చాలా ఆనందంగా వుంది. నా ఇల్లు పావనమైపోయిందనుకో ! చాలా మందే వచ్చి చందాదారులుగా చేరుతున్నారట ! కొన్నాళ్ళకి నికరాదాయం కూడా ఏర్పడుతుందని అనుకుంటున్నారు. అప్పటివరకూ మన ఊరి అబ్బాయిలే ఇలా వంతులవారీగా కూర్చుని పనులు చూస్తున్నారు. తర్వాత ఎవరో ఒకర్ని ఉద్యోగస్తుడిగా తీసుకుంటారు కాబోలు ! "

పెద్దమ్మలో అలాంటి మంచి ఆలోచనలు వున్నాయని అప్పటివరకూ తనకూ తెలియదు ! అభినందనను మాటల్లో చెప్పలేక పెద్దమ్మను చేతులతో చుట్టేసి తెలియజేసింది.

*****

తరువాత కొన్ని రోజులకే ...తను ఆఫీసులో కూర్చున్నప్పుడు సుభాష్ వచ్చాడు.

ఇద్దరు ముగ్గురు రైతులుండటంతో వాళ్ళు మాట్లాడి వెళ్ళేవరకూ ఎదురుచూస్తున్నట్లుగా కూర్చున్నాడు. వాళ్ళు వెళ్ళగానే ముందుకు వచ్చి ఎదురుగా కూర్చునేసరికి తను లేచి నిలబడుతూ " ఏదో..అందరూ కలిసి మాట్లాడాలని లైబ్రరీలో సాయంకాలం సమావేశం ఏర్పాటు చేశామని భగవాన్లు చెప్పాడు. నాకు తీరిక ఉంటే మాత్రం వస్తాను..." అంది.

" దానిగురించి చెప్పటానికి రాలేదు. వ్యవసాయాధికారిగా మీ దగ్గర్నుండి కొన్ని సలహాలు, సూచనల కోసం వచ్చాను" అన్నాడు.

" అయితే అడగండి.." అంటూ తనూ కూర్చుంది.

" నేను ఈ ఊళ్ళో...ఓ నాలుగెకరాలు కౌలుకి తీసుకుంటున్నాను. పరమేశ్వరం గారు ఇస్తామన్నారు.."

" ఏంటీ...మీరు వ్యవసాయం చేస్తారా ? ఏదో సబ్జెక్టు చెప్పారు. దానిమీద రీసెర్చ్ కదా చేస్తానని అన్నారూ..?"

" అవును...పూర్తిగా ఆ పనిమీదే వుండాల్సిన అవసరం లేదు. ఆ పైన...ఒడ్డున నిలబడి రైతులగురించీ, వ్యవసాయం గురించీ తెలుసుకోవాలనుకోవటంకంటే, దిగితే లోతు తెలుస్తుంది కదాని ఆలోచన వచ్చింది "

" అదంత సులువు కాదని తెలుసుకోండి ముందు ..."

" తెలుసండీ...ఇష్టంగా కష్టపడితే, వ్యవసాయాన్నీ లాభసాటిగా నిరూపించవచ్చనిపించింది! "

తనకు ఎందుకో ఆ మాటలకు చిన్నగా నవ్వు వచ్చింది.

అతను తన వేపు చురుగ్గా చూసాడు. " మీరేదో ఎగతాళిగా నవ్వుతున్నారు ! నేనీ విషయం మీద చాలానే స్టడీ చేసాను. కేవలం చదవటమే కాదు, ఎంతోమందిని కలిశాను. పశ్చిమగోదావరి జిల్లాలోని వెజిటబుల్ విలేజ్ గా పేరుగాంచిన రావూరుపాడుకు వెళ్ళి అక్కడి రైతులతో మాట్లాడాను...పరిస్థితుల్నీ అధ్యయనం చేశాను.

తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి వెళ్ళి మొక్కల మేష్టారుగా పేరుపొందిన రావుగార్నీ కలిసి, కుటుంబం అంతా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే, అక్కడ మొక్కలు నాటే పద్ధతికి శ్రీకారం చుట్టినందుకు అభినందనల్నీ తెలియజేసి కొన్ని సలహాలూ తీసుకున్నాను. ఇలా చాలా మందినే కలిశాను. వాళ్ళు సాగుచేసే విధానాల్ని కొన్నాళ్ళు వాళ్ళతోనే ఉండి పరిశీలించాను.

ఇంకో మాట కూడా వినండి. ఆ మధ్యనెపుడో బూరుగుపూడి వెళ్ళి సర్పంచ్ సూర్యచంద్రగారిని కలిసి చాలా తెలుసుకున్నాను. ఆదర్శ గ్రామంగా బూరుగుపూడిని ఆయన తీర్చిద్దిన విధానానికి నిజంగా ముగ్ధుడినైపోయాను. అందుకే ఆ పద్ధతుల్లోనే ఈ ఊరినీ అలా నిలపాలనుకుంటున్నాను. "

ఆశ్చర్యంగా చూసి " మీ దగ్గరేమైనా మంత్రదండం ఉందా ? ఇన్ని పనులు...ఎలా..ఎలా..? " అని అడిగింది.

అతను చిన్నగా నవ్వాడు. " భీమన్న లాంటి బక్కపలుచని మనిషి ఒక్కడే జలయజ్ఞానికి శ్రీకారం చుట్టాడు! ఇప్పుడు ...ఎంతమందో చేతులు కలుపుతున్నారు.. సాధించగలనా లేదా అనే మీమాంస లేకుండా భీమన్న పని మొదలుపెట్టేశాడు.

అదే స్ఫూర్తితో నేనూ...అంతే ! అంతెందుకూ, లైబ్రరీ విషయమే తీసుకోండి, నిమిషాల మీద ఏం ఖర్చు లేకుండా ఎలా జరిగిపోయిందో..! "

" అది...పెద్దమ్మ ఇల్లు ఇచ్చింది కాబట్టి. మీరు జర్నలిస్టు కావటం వలన ఏ పరిచయాలతో అన్ని పుస్తకాలు సేకరించగలిగారో...లేక మీ స్వంత డబ్బులు ఉపయోగించారో ఏదీ తెలియదు. పొలం ఊరికి దగ్గరగా ఉంది కాబట్టి హాస్పిటల్ పెట్టటానికి బాగానే వుంటుంది. కానీ బిల్డింగ్ లు, పరికరాలూ చాలానే అవుతుందిగా...ఎలా వీలవుతుందనుకుంటున్నారూ..?"

*****